# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# సెంట్రల్ మిలటరీ కమీషన్

<u>పత్రికా ప్రకటన</u>

**నవంబర్ 30, 2012**

## భారత పాలకవర్గాల నరహంతక దాడులను ఎదిరించండి!
## ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ దోపిడి పాలకవర్గాలు సాగిస్తున్న ప్రజలపై యుద్ధం - 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ఓడించండి!
## శిక్షణా శిబిరం స్థాపనా ముసుగులో విప్లవోద్యమ అణచివేత కోసం బస్తర్‌లో భారత సైన్యాన్ని మోహరించడాన్ని వ్యతిరేకించండి! ప్రతిఘటించండి!
### పిఎల్‌జిఏ 12వ వార్షికోత్సవాల సందర్భంగా సి.పి.ఐ. (మావోయిస్టు) సెంట్రల్ మిలటరీ కమీషన్ పిలుపు

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం, అంతర్జాతీయ కార్మికవర్గ సైన్యానికి చెందిన ఒక విభాగంగా, భారత విప్లవ మహోపాధ్యాయులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ చటర్జీల పథ నిర్దేశంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) 2000 సం॥రం డిసెంబర్ 2 నాడు ఆవిర్భవించింది. 2012 డిసెంబర్ 2 నాటికి అది 12 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోంది. ఈ సందర్భంగా గెరిల్లాజోన్లు, ఎర్రపోరాట ప్రాంతాలన్నింటా 12వ వార్షిక వారోత్సవాలను జరపాల్సిందిగా, భారత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో దోపిడి పాలకవర్గాలు సాగిస్తున్న ప్రజలపై యుద్ధం 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ప్రజాయుద్ధం ద్వారా ఓడించేందుకు గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ విస్తరించాల్సిందిగా సెంట్రల్ మిలటరీ కమీషన్ (సిఎంసి) పిలుపునిస్తోంది.

ఈ సంవత్సరంలో దాదాపు వందమంది కార్మికవర్గ ఉత్తమ పుత్రికలు, పుత్రులు, సాధారణ ప్రజానీకం అత్యంత విలువైన తమ ప్రాణాలను అర్పించారు. భారతదేశ విప్లవోద్యమ నాయకుడూ, ప్రజాయుద్ధ సేనానీ, మన పొలిట్‌బ్యూరో సభ్యుడూ, పీడిత ప్రజలకు ఆప్తుడూ అయిన కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు అలియాస్ కిషన్‌జీ కేంద్ర– బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు, బెంగాల్ ఎస్ఐబి సహా కేంద్ర ఇంటలిజెన్స్ సంస్థలు పన్నిన కుట్రకు బలై బూటకపు ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ హరక్ (శ్రీకాంత్) అనారోగ్యంతోనూ, ఉత్తర తెలంగాణ ఎస్‌జెడ్‌సి సభ్యుడు కామ్రేడ్ గుండేటి శంకర్ (శేషన్న) పాముకాటుతోనూ, ఝార్ఖండ్‌లోని ఛత్‌రా జిల్లా కుందా అడవుల్లో బీహార్–ఝార్ఖండ్–ఉత్తర ఛత్తీస్‌గఢ్ స్పెషల్ ఏరియా నాయకుడు కామ్రేడ్ అజయ్ గంజూ పోలీసుల చేతిలో హత్యకు గురయి అమరులయ్యారు. అసోంలో ఒక బూటకపు ఎన్‌కౌంటర్‌లో లీడింగ్ టీం (ఆర్‌సి స్థాయి) కామ్రేడ్ సిద్ధార్థ బుర్గోహెయిన్‌తో పాటు ముగ్గురు కామ్రేడ్స్ అమరుడయ్యారు. దండకారణ్యంలో దక్షిణ ఆర్‌సి సభ్యుడు కామ్రేడ్ విజయ్ ఒక దుర్ఘటనలో, పార్టీలో సీనియర్ కార్యకర్త కామ్రేడ్ స్వరూప (సునీత) అనారోగ్యంతో అమరులయ్యారు. కార్మికోద్యమ నేత, పీడిత ప్రజల న్యాయవాది కామ్రేడ్ బిఎస్ఎ సత్యనారాయణ, శ్రీకాకుళ పోరాట యోధుడు, మొక్కవోని కమ్యూనిస్టు నిబద్ధతకు ప్రతీక కామ్రేడ్ గోరు మాధవరావు, ఆదివాసి నాయకుడు కామ్రేడ్ పేందురు భీంరావు తుదిశ్వాస విడిచారు. పోలీసు హత్యాకాండలో దాదాపు 60 మంది సాధారణ ప్రజలు, ప్రజాసంఘాలు, విప్లవ ప్రజా కమిటీల కార్యకర్తలూ నేలకొరిగారు. దండకారణ్యంలోని బీజాపూర్ జిల్లా బాసగూడ ప్రాంతంలో సార్కిన్‌గూడ ఊచకోతలో 19 మంది నిరాయుధ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వీరందరికీ పేరుపేరునా అరుణాంజలి ఘటిస్తూ వారి ఆశయసాధనకై ప్రతినబూనుదాం.

భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో భారత దోపిడి పాలకవర్గాలు అమెరికా సామ్రాజ్యవాదుల నిర్దేశత్వంలో విప్లవ ప్రతీఘాతుక వ్యూహాన్ని (ఎల్.ఐ.సి.) పకడ్బందీగా అమలుజరుపుతున్నాయి. దీనిని ప్రతిఘటించడం కోసం ఈ సంవత్సరం వివిధ గెరిల్లాజోన్లలో పిఎల్‌జిఏ చేపట్టిన వివిధ ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్లు, ప్రతిఘటనా చర్యలు రాజకీయంగా మంచి ప్రభావాన్ని వేశాయి. దండకారణ్యంలోని కోయ కమాండో కమాండర్లు కరటం సూర్య, కిచ్చ నందల వాహనంపై గొర్‌గొండ వద్ద జరిగిన ఆంబుష్ (సుక్మా), పుస్‌టోలా వద్ద సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాల కాన్వాయ్‌పై నిర్వహించిన సాహసోపేత భారీ ఆంబుష్ (గడ్చిరోలి), ఇర్పుగుట్ట ఆంబుష్ (కాంకేర్), కిరందుల్ నైట్ ఆంబుష్ (దంతేవాడ), సల్వాజుడుం నాయకుడు, కాంగ్రెస్ నాయకుడు, నరహంతక మహేంద్ర కర్మపై ఆంబుష్ (దంతేవాడ), ఝార్ఖండ్‌లో బరగఢ్ వద్ద మైన్‌ప్రూఫ్ వాహనంపై జరిగిన వీరోచితమైన ఆంబుష్ (గఢవా), ఖరంజి టుంగీ ఆంబుష్ (లాతేహార్), లభర్ అటవీ ప్రాంతంలో శత్రు హెలికాప్టర్‌పై పిఎల్‌జిఏ సాహసోపేతంగా చేసిన దాడి (లాతేహార్), ఎన్‌హెచ్–2పై ఆంబుష్ (లాతేహార్), గిరిడి పట్టణంలో ఖైదీల ఎస్కార్ట్ వాహనంపై దాడి–8 మంది మావోయిస్టు ఖైదీల విడుదల, బీహార్‌లో గయ జిల్లా బాల్‌థోర్, డుమరియా అడవుల్లో ఒకే రోజు సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలపై పిఎల్‌జిఏ సాగించిన సమరాలు, శకర్‌బాంథా వద్ద మైన్‌ప్రూఫ్ వాహనంపై ఆంబుష్, ఏఓబిలో జన్నిగూడ (డైక్ త్రీ) ఆంబుష్ (చిత్రకొండ–బలిమెల రోడ్డు), సీలేరు సింగిల్ యాక్షన్, ఒడిషాలో బదరపంగ ఆంబుష్ (కంధమాల్), ఉత్తర తెలంగాణలో ఒక నైట్ ఆంబుష్, పశ్చిమ బెంగాల్‌లో గ్వాల్తోర్ ఆంబుష్ (లాల్‌గఢ్ ప్రాంతం) వంటి చర్యలు, అనేక సింగిల్ యాక్షన్లు, ఇతర యుద్ధచర్యలలో 114 మంది పోలీసులు మరణించగా, 191 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. వారి వద్ద నుంచి 29

ఆయుధాలను పిఎల్‌జిఏ హస్తగతం చేసుకుంది. పిఎల్‌జిఏ గెరిల్లా చర్యల వల్ల శత్రువు మరిన్ని బలగాలను మన ప్రాంతాల్లో మోహరించాల్సిన స్థితికి, తన బలగాలను విశాల ప్రాంతాలలో వికేంద్రీకరించాల్సిన స్థితికి నెట్టబడ్డాడు. ఫలితంగా శత్రుదాడిని నిలువరించడంలో పిఎల్‌జిఏ బలగాలు విజయం సాధించగలిగాయి.

గత సం॥రం మధ్య భాగం నుండి ఉద్యమ ప్రాంతాలపై శత్రువు దాడుల్ని మరింత తీవ్రతరం చేశాడు. ఉద్యమ ప్రాంతాల్ని దెబ్బతీసే, ముక్కలుగా ప్రాంతాల్ని తెగ్గొట్టి, మన సమన్వయాన్ని దెబ్బతీసే లక్ష్యంతో ఈ ఆపరేషన్లను చేపడుతున్నారు. ప్రజలపై సార్కిన్‌గూడ్ వంటి ఊచకోతలు, విప్లవ నాయకుల, కార్యకర్తల హత్యలు పెరుగుతున్నాయి. సల్వాజుడుం, నాగరిక్ సురక్షా సమితి, టిపిసి, ఎస్‌పిఎం, హర్మద్ వాహిని, భైరవ్‌సేన, శాంతి కమిటీ, శాంతి సంఘం వంటి విప్లవ ప్రతీఘాతుక గ్యాంగులు, రహస్య హంతక ముఠాలు, పోలీసు, పారామిలటరీ, కమాండో బలగాలు సంయుక్తంగా ఇలాంటి ఊచకోతలకు దిగుతున్నాయి. మావోయిస్టులను, 'టెర్రరిస్టులను' ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎన్.సి.టి.సి. (నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్) 'దేశ ప్రజల నామమాత్ర సార్వభౌమత్వానికీ, శాంతికీ, భద్రతకూ, స్వేచ్ఛకూ, ప్రజాస్వామ్యానికీ, జీవించే హక్కుకూ అతి పెద్ద ముప్పు'గా పరిణమించనుంది.

విప్లవోద్యమ నిర్మూలన కోసం సైన్యాన్ని దించుతున్నారు. భారత సైన్యం, వాయుసేన చేపట్టనున్న దాడులకు అవసరమైన మౌలిక సదుపాయాల్ని నిర్మిస్తున్నారు. సైనిక దాడులకు మద్దతుగా వాయుసేనతో దాడులు చేయడం కోసం ఛత్తీస్‌గఢ్, విదర్భ, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, ఒడిషాలలోని అనేక ప్రాంతాల్లో ఎయిర్ బేస్‌ల నిర్మాణం కొనసాగుతోంది. నాలుగు ట్రై-జంక్షన్స్ (మూడు రాష్ట్రాల కూడళ్లు) ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్- మహారాష్ట్ర; ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్-ఒడిషా; ఛత్తీస్‌గఢ్-ఝార్ఖండ్-ఒడిషా; ఒడిషా-పశ్చిమ బెంగాల్-ఝార్ఖండ్‌లలో 400 ఫోర్టిఫైడ్ పోలీస్‌స్టేషన్లు నిర్మిస్తూ కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేస్తున్నారు. మన పిఎల్‌జిఏ బలగాలు చేసే ఎటువంటి దాడినైనా ఎదుర్కొనే విధంగా బలగాలకు శిక్షణ, ఆయుధాలు, సామగ్రి అందజేస్తున్నారు. డ్రోన్ (యుఏవి) దాడుల కోసం సన్నాహాల్ని వేగవంతం చేస్తూ, ఫీల్డులో ఉన్న నాయకత్వాన్ని నిర్మూలించడంపై కేంద్రీకరిస్తున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం 2200 కమ్యూనికేషన్ టవర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దట్టమైన అడవుల్లో గెరిల్లా బలగాల కదలికలపై నిఘా ఉంచే లక్ష్యంతోనే 2012 ఏప్రిల్ చివర్లో రిసాట్-1 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. విప్లవ శిబిరాన్ని చీలదీసి, దోపిడి వర్గాల సామాజిక పునాదిని పెంచుకునే సంస్కరణల్ని తీవ్రతరం చేస్తున్నారు. వీటన్నింటి ద్వారా రాజకీయ నాయకుల, అధికారుల, కాంట్రాక్టర్ల, తెగ పెద్దల/పెత్తందార్ల, ధనిక, మధ్యతరగతి రైతాంగంలోని ఒక సెక్షన్‌కు ఆర్థిక లాభాలు చేకూర్చి వారిని తమకు సామాజిక పునాదిగా ఉపయోగించుకుంటున్నారు. సోషలిజం-కమ్యూనిజానికి కాలం చెల్లిందని, అది విజయం సాధించలేదని ఒకవైపు, 5-10 సం॥రాల్లో విప్లవోద్యమాన్ని దెబ్బతీస్తాం, మీరు (విప్లవ శిబిరం) గెలువలేరు కాబట్టి విప్లవోద్యమాన్ని వదిలిపెట్టి పోలీసుల్లో చేరండి, ఇన్‌ఫార్మర్లుగా మారండని మరోవైపు నిరంతరం మానసిక యుద్ధం చేస్తున్నారు. సవ్యసాచి పండా వంటి విచ్ఛిన్నకులను ప్రోత్సహిస్తూ ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

వనరుల దోపిడి కోసం, సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల డాలర్ల విలువైన సంపదలను దోచిపెట్టడం కోసం విప్లవకారులపై, పీడిత ప్రజలపై క్రూరమైన, హేయమైన, అమానవీయమైన దాడులకు దిగడం, మావోయిస్టు పార్టీ నేతృత్వంలో మొగ్గతొడుగుతున్న ప్రత్యామ్నాయ ప్రజారాజ్యాధికారాన్ని రూపుమాపడం భారత పాలకవర్గాల, వారి సామ్రాజ్యవాద ప్రభువుల లక్ష్యం. దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని, ప్రజాస్వామిక, రాజకీయ ఆందోళనలను తీవ్రతరం చేయడం ద్వారా భారత దోపిడి పాలకవర్గాల దాడిని ఓడించాల్సిందిగా పీడిత ప్రజలకు, ప్రజాశ్రేయోభిలాషులకు సిఎంసి పిలుపు నిస్తోంది.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం మరింత లోతుగా విస్తరిస్తూ కొనసాగుతున్నది. సామ్రాజ్యవాదం సంక్షోభం నుండి గట్టెక్కడానికి ఒకవైపు తమ దేశాల్లో కార్మికుల పైన, మధ్యతరగతి ప్రజానీకంపైన దోపిడిని తీవ్రతరం చేయడమే కాకుండా వెనుకబడిన దేశాల్లోని అన్ని రకాల వనరులను (మానవ, భౌతిక వనరులను) కొల్లగొట్టేందుకు సామ్రాజ్యవాదులు పోటీ పడుతున్నారు. అమెరికాలో, ఇతర సామ్రాజ్యవాద దేశాలలో రేసిజం (జాత్యహంకారం) నానాటికీ పెచ్చరిల్లుతుండడంతో సిక్కులు, తూర్పు ఆసియావాసులు, దక్షిణాసియావాసులు, ముస్లిములు, అరబ్బులపై దాడులు పెరిగిపోయాయి. ఈ నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా గత సంవత్సర కాలంగా యూరప్‌లోని అనేక దేశాల్లో కార్మికులు, యువతరం, మహిళలు, మధ్యతరగతి ప్రజానీకం ఆందోళనలు చేస్తున్నారు. కార్మికవర్గ పార్టీలు, ప్రగతిశీల ప్రజా సంస్థలు తిరిగి బలం పుంజుకుంటున్నాయి. వెనుకబడిన దేశాలన్నింటిలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు వేర్వేరు రూపాల్లో తీవ్రతరమవుతున్నాయి. అరబ్ ప్రజావెల్లువ తర్వాత అక్కడ తిరిగి అమెరికా అనుకూల పాలకులే మరో రూపంలో అధికారంలోకి రావడంతో ప్రజలు అనివార్యంగా విప్లవ మార్గాన్ని ఎంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నారు. అనేక దేశాలలో పీడిత జాతుల ప్రతిఘటనా పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇస్లాం మతాన్ని అవమానపరిచే అమెరికా సినిమాకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం ప్రజానీకం భగ్గుమంది. ఫిలిప్పైన్స్, ఇండియాలలో మావోయిస్టు ప్రజాయుద్ధం పురోగమిస్తుండడం, నేపాల్‌లో యుసిపిఎన్ (ఎం) చేపట్టిన రివిజనిస్టు పంథాను వ్యతిరేకిస్తూ విప్లవశక్తులు వేరుపడడం, టర్కీ, పెరూ, బంగ్లాదేశ్ తదితర దేశాలలో మావోయిస్టు శక్తులు క్రియాశీలంగా ఉండడం, యూరప్‌లోని పలు దేశాల్లో మావోయిస్టు సంస్థలు, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలు మన దేశంలో సాగుతున్న ప్రజాయుద్ధానికి సంఘీభావంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం సానుకూల పరిణామం.

మన దేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా మౌలిక వైరుధ్యాలన్నీ తీవ్రతరమవుతున్నాయి. సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే పేదలు మరింత పేదలవుతున్నారు. దేశ జనాభాలో 77 శాతం ప్రజలు రోజుకు కనీసం 20 రూపాయలు ఖర్చు చేయలేని కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, రాబర్ట్ వాద్రా, కేంద్ర మంత్రులు శరద్ పవార్, సల్మాన్ కుర్షీద్, బిజెపి అధ్యక్షుడు నితిన్ గడ్కరి తదితరుల కుంభకోణాలు బయటపడుతూ ఒక్కొక్కరి ముసుగును చింపివేస్తున్నాయి. ఈ ఆర్థిక అంతరాలు, అవినీతి సామాజిక అశాంతికి కారణమవుతూ విప్లవానికి వనరుగా మారుతున్నాయి. జల్-జంగల్-జమీన్ కోసం, నిర్వాసిత సమస్యకు వ్యతిరేకంగా ఆదివాసులు, తదితర రైతాంగం, వ్యవసాయ రంగంపై సబ్సిడీల ఎత్తివేతకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధరల కోసం, ఎరువులు, పురుగు మందుల కల్తీకి వ్యతిరేకంగా, కరెంట్ కోసం, విత్తనాల పరిరక్షణ కోసం రైతాంగం, అధిక ధరలు, నిరుద్యోగం, కరువు, ఆకలి చావులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. చిల్లర వ్యాపారులు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. విదేశీ పెట్టుబడికి, ప్రైవేట్ పెట్టుబడికి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విమానయాన

రంగంలోని ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా పైలట్లు, బ్యాంకింగ్, బీమా రంగం ఉద్యోగులు, విద్యార్థులు పోరాడుతున్నారు. గుర్‌గావ్‌లో మారుతి సుజికి కంపెనీ లాకౌట్ ఫలితంగా వీధుల పాలైన వేలాది కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు దిగారు. చేతివృత్తుల వాళ్లు, మత్స్యకారులు, మహిళలు, దళితులు, ఆదివాసులు – అన్ని సెక్షన్ల ప్రజలు తమ జీవనాధారాల్ని కోల్పోవడానికి వ్యతిరేకంగా, భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల, సామ్రాజ్యవాదుల దోపిడికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. ఎంతటి తీవ్ర దమనకాండ అమలుజరుపుతున్నప్పటికీ జాతి విముక్తి కోసం, స్వాతంత్ర్యం కోసం కాశ్మీరు, ఈశాన్య జాతుల పోరాటాలు మళ్లీ మళ్లీ ఎగస్తూనే ఉన్నాయి. ఈ అనుకూల పరిస్థితిని ఉపయోగించుకొని 'ప్రజాయుద్ధం ద్వారా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకుందాం' అనే నినాదంతో నిశ్చయాత్మకమైన ప్రజాయుద్ధాన్ని, ప్రజాస్వామిక, రాజకీయ ఆందోళనలను దేశవ్యాప్తంగా తీవ్రతరం చేయాలని భారత పీడిత ప్రజలకు, దేశభక్తయుత, ప్రజాస్వామ్య శక్తులకు సిఎంసి పిలుపు నిస్తోంది.

మన దేశంలోని 77 శాతం ప్రజానీకం అనుభవిస్తున్న కటిక దారిద్ర్యానికి, నిరుద్యోగానికి, నిరక్షరాస్యతకు, రోగాలకు కారణమవుతున్న సామ్రాజ్యవాదుల తొత్తులయిన భారత బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల దోపిడి, పీడనలే కారణం. ఈ దోపిడి, పీడనలకు తావులేని నూతన ప్రజాస్వామ్య వ్యవస్థను, ఆర్థిక, సామాజిక అంతరాలు లేని సోషలిస్టు వ్యవస్థను స్థాపించాలనే రాజకీయ లక్ష్యసాధన కోసమే పిఎల్‌జిఏ పోరాడుతుంది. శాంతియుత పద్ధతుల్లో గానీ, బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల మార్గంలో గానీ ఈ రాజకీయ లక్ష్యాన్ని సాధించలేని పరిస్థితులలో, అనివార్యమైన స్థితిలోనే మేం సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తున్నాం. ఈ పద్ధతులను అనుసరించి బ్రిటిష్ వలస పాలనా కాలంలో గానీ, వలసానంతర కాలంలో గానీ సాగిన అనేక పోరాటాలు ఈ రాజకీయ లక్ష్యసాధనలో విఫలమయ్యాయి. మా పోరాటం తీవ్రవాదమూ కాదు, టెర్రరిజం కాదు. అది కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాపై కొనసాగిస్తున్న దుష్ప్రచార దాడిలో భాగమే. విప్లవోద్యమంపై కొనసాగించే ఫాసిస్టు దాడికి సాధికారతను కల్పించడం కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా ప్రజాయుద్ధాన్ని తీవ్రవాదమనీ, టెర్రరిజమనీ దుష్ప్రచారం చేస్తున్నాయి. మన భారతదేశాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టుపెడుతూ, కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్న దోపిడిదారులే దేశద్రోహులు. ఈ దోపిడి వర్గాలను, దేశద్రోహుల్ని అధికారం నుండి కూలదోసి పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని సాధించడం కోసం సాగుతున్న ప్రజాయుద్ధంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రజాయుద్ధం సాగిస్తున్న పిఎల్‌జిఏలో చేరండని పిలుపు నిస్తున్నాం. అవినీతిని అంతం చేస్తామనే అన్నా హజారే, అరవింద్ కేజ్రీవాల్‌లు ఈ దోపిడి వ్యవస్థ పరిరక్షకులే. లోక్‌పాల్ వ్యవస్థ లాంటి కంటితుడుపు సంస్కరణల్ని మాత్రమే వీళ్లు తీసుకురాగలుగుతారు. వీరిని నమ్మడమంటే ఎండమావిలో నీరుందని నమ్మి మోసపోవడమే. స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, సమానత్వం ప్రాతిపదికగా, స్వావలంబన, స్వతంత్ర, ప్రజాస్వామిక భారతావని నిర్మాణం కోసం ప్రజాయుద్ధంలో పాల్గొనాలని, ఈ ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్న పిఎల్‌జిఏలో పెద్దయెత్తున చేరాలని రైతాంగానికి, కార్మికులకు, విద్యార్థులకు, మేధావులకు, డాక్టర్లకు, లాయర్లకు, పత్రికా విలేఖర్లకు, చేతివృత్తులవారికి, దళితులు, ఆదివాసులు, మహిళలకు, వివిధ మైనారిటీలకు, వివిధ జాతుల ప్రజలకు, దేశభక్తులకు, ప్రజాస్వామికవాదులకు పిలుపు నిస్తున్నాం.

పిఎల్‌జిఏ సాగిస్తున్న ప్రజాయుద్ధపు రాజకీయ లక్ష్యాన్ని ప్రచారం చేయడానికీ, ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఓడించడం కోసం వీధివీధినా, వాడవాడనా, గ్రామగ్రామానా పెద్దయెత్తున ర్యాలీలను, సభల్ని, సమావేశాల్ని నిర్వహించండి!

గమనిక : ఈ సందర్భంగా 'బంద్' ఉండదని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ మా పిలుపును ఉపయోగించుకొని పోలీసులు కావాలనే బంద్ వాతావరణం సృష్టిస్తున్నారు. దీనిని నమ్మవద్దని, పిఎల్‌జిఏ వారోత్సవాల సందర్భంగా బంద్ ఉండదని తెలియజేస్తున్నాం.

(దేవ్‌జీ)

సెంట్రల్ మిలటరీ కమీషన్ తరఫున

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)